International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.5, Issue-9, September, 2018
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# నందుల సుశీలా దేవి గారి నవలా సమీక్ష

## (శ్రావణ మేఘాలు మరియు తరంగం నవలలు)

డా॥ ద్వివేది కృష్ణ గాయత్రి
తెలుగు అధ్యాపకురాలు
వి.కె.వి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొత్తపేట

దాదాపు మూడు దశాబ్దాల కాలం నుండి నందుల సుశీలా దేవి గారు ప్రముఖ నవలా, కథా రచయిత్రిగా తెలుగు సాహితీ లోకానికి సుపరిచితులు. ఈమె రసాయనశాస్త్ర అధ్యాపకురాలిగా పని చేసి రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యక్షురాలిగా పదవీ విరమణ చేశారు. ఈమె దాదాపు 200 పైచిలుకు కథలు వ్రాసారు. ఈమె కథలు స్వాతి, ప్రభ, జ్యోతి వంటి వార పత్రికలలోను, మాస పత్రికలలోను ప్రచురింపబడ్డాయి.

ఈమె నవలలో మొట్టమొదటిది 'సరళీ స్వరాలు'. ఈ నవల ఆంధ్రప్రభ నవలల పోటీలో దాదాపు 30 సం॥క్రితం బహుమతి పొందిన నవల. ఆ తరువాత 'చిగురాకులు', 'శ్రావణ మేఘాలు', 'అమృత హస్తం', 'సుజాత', 'సుడిగాలి' వెలుగుచూశాయి. ఈ నవలలు తెలుగు సాహితీ లోకానికి సుపరిచితాలు. నందుల సుశీలా దేవి 1940లో రాజమండ్రిలో పుట్టారు. భర్త సుసర్ల సుబ్రహ్మణ్యం. అంజన, రామ్మోహన్ పిల్లలు.

ఈమెకు ఉత్తమ ప్రభుత్వ ఉన్నత విద్యా అధ్యాపకురాలి పురస్కారం, చక్రపాణి అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం లభించాయి. వంగూరి చిట్టెన్ రాజు గారి ఆహ్వానం మేరకు అమెరికా వెళ్ళి అక్కడి తెలుగు వారికి తన సాహిత్యాన్ని పరిచయం చేశారు. తెలుగు సాహితీ అభిమానుల గౌరవ సత్కారాలను అందుకున్నారు. కేవలం సాహిత్య సేవే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా ఈమె పాల్గొన్నారు. 'శ్రావణి' వృద్ధాశ్రమం ప్రెసిడెంట్‌గా వృద్ధులకు తన సేవలనందించారు. వృద్ధుల మనో భావాలను వర్ణిస్తూ రచించబడిన కథల సంపుటి 'సాయం సంధ్య'. అలానే 'శరన్మేఘం' మరో కథల సంపుటి.

<u>శ్రావణ మేఘాలు</u> : – శ్రావణ మేఘం నీటితో బరువుగా ఉంటుంది. అలాగే ఈ నవలలోని నాయికా నాయకులు విఫలమైన తమ ప్రేమ భావాలతో బరువైన హృదయాన్ని కలిగి ఉంటారు. ఈ శీర్షిక దాదాపు కథాంశాన్ని సూచిస్తోంది. ఈ నవలలో సుజాత కెమిస్ట్రీ ఆనర్స్ విద్యార్థి. యూనివర్సిటీ ఫస్ట్ రాగలిగిన తెలివితేటలు, శ్రమ పడే తత్త్వం కూడా కలిగినది. ఈమెకు రఘుతో పరిచయం ఏర్పడుతుంది. రఘుతో ఈమె స్నేహం కేవలం సోదర స్నేహమే అయినా రఘు ఆమెను వివాహం చేసుకోవడానికి తన భావన వెలిబుచ్చుతాడు. అంతకు మునుపే మాధవరావును సుజాత ప్రేమిస్తుంది. తన ప్రేమను వ్యక్తం చేస్తుంది. సుజాత ప్రేమను ఒక ఆకర్షణగా, ఫాంటసీగా భావించి తిరస్కరిస్తాడు మాధవరావు. వారిద్దరికీ మధ్య ఎప్పుడూ సయోధ్య లేదు. అయినా సుజాత మనస్సులో మాధవరావే ఉన్నాడు కాబట్టి రఘుని స్వీకరించలేకపోతుంది. రఘునే కాదు, ఆమె ఇంకెవరినీ కూడా తన సహచరునిగా ఊహించుకోలేదు. రఘు ఆమె తిరస్కారాన్ని భరించలేకపోతాడు. సరళ సుజాత స్నేహితురాలు. సుజాత భావాలను రఘుకు తెలియజేస్తుంది. రఘు బాధ పడ్డాడు కానీ ఇంకేం చేయలేని స్థితి. రఘుని బాధ పెట్టాననే బాధతో సుజాత బాగా చదివినా ఆ సంవత్సరం పరీక్షలు వ్రాయలేక 'విత్ డ్రా' అవుతుంది. రఘు ఆమె ఆకాంక్ష నెరవేరాలని చెప్పి వీడ్కోలు పలుకుతాడు. ఇద్దరూ బరువెక్కిన హృదయాలతో తమ తమ గమ్యాలకు బయలుదేరారు. జీవితంతో రాజీ పడలేకపోవడం కూడా ఒక శాపం లాంటిదే. రాజీ పడలేని, సమన్వయాన్ని సాధించలేని జీవితాలకు ముందడుగు ఉండదు.

ఎప్పుడూ వెనుక చూపే. గతం గురించిన ఆలోచనలు బాధిస్తూ ఉంటాయి. గతానుభవాలు ఒక పాఠం కావాలి. లేదా ఎదగడానికి ఒక మెట్టు కావాలి గాని అవి జీవితానికి బంధాలు కాకూడదు. ఈ నవలలో సుజాతది రాజీ పడలేని మనస్తత్వం. అనవసరపు బాధలతో అభిశప్తురాలుగా ఉంటుంది. తన అభిప్రాయాన్ని ఖచ్చితంగా చెప్పలేక తప్పించుకు తిరుగుతూ రాజీ పడలేక తాను ఇతరులను బాధపెడుతున్నాననే బాధతో కృంగిపోతూ కృశిస్తూ ఉంటుంది. "రాజీ పడలేని జీవితాలు వీరగాథల మాదిరిగా చూడటానికి కనపడవచ్చు గాని వాని నిరుపయోగిత అనుభూతం మాత్రమే అవుతుంది". అంటూ పుస్తకం వెనుక ప్రచురించబడింది.

ఈ నవలలోని సరళ పాత్ర వాస్తవానికి దగ్గరగా ఉంటుంది. ఈమె కలలలో జీవించదు. జీవితాన్ని గత జల సేతుబంధనం చేసుకోదు. ఈమె కూడా ఇంటర్ చదువుతున్న సమయంలో ప్రసాద్ అనే వ్యక్తిని ప్రేమించింది. ప్రసాద్ నుండి ప్రేమలేఖలందేవి. మౌనమే వీరి ప్రేమకు యానకంలా పనిచేసింది. అయితే సరళ ప్రసాద్‌ని 'పెళ్ళెప్పుడు చేసుకుంటావు'? అంటూ నిలదీసి మౌన ప్రేమకు ఆటంకం కల్పించింది. ప్రసాద్ పిరికి వాడు. సవతి తల్లిని ఎదిరించలేడు. ఆమె చెప్పిన ఆమె బంధువుల అమ్మాయినే పెళ్ళి చేసుకున్నాడు. సరళ ఏడుస్తూ కూర్చోలేదు. తన భవిష్యత్తును తాను చక్కగా నిర్మించుకునే ప్రయత్నం చేసింది. ఈమె బి.ఎల్. చదువుతోంది. అందరితో సరదాగా ఉంటుంది. ఏ విషయానికీ తనలో తానే మథనపడిపోదు. గతాన్ని గుర్తు చేసుకుంటూ బాధపడదు. "ప్రేమ కూడా జీవితంలో ఒక భాగమే కానీ అదే జీవితమూ కాదు, జీవిత గమ్యమూ కాదు". అని సుశీలాదేవి సరళ పాత్ర ద్వారా నిరూపించారు.

ఇంకా ఈ నవలలో ఉమెన్స్ హాస్టల్‌లో అమ్మాయిల జీవితం, వారి దినచర్య మొదలగు అంశాలను చక్కగా కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. విశాఖపట్నం నగరం, ఆంధ్రా యూనివర్సిటీ కళ్ళ ముందు కదలాడుతూ ఉంటాయి. రచయిత్రి ప్రియమైన విషయం (సబ్జక్ట్) కెమిస్ట్రీ కాబట్టి కెమిస్ట్రీ అధ్యయనంలోని బాధలు, సంతోషం, కష్టం, ప్రాక్టికల్స్‌లో తలయెత్తే ఇబ్బందులు మొదలైనవి చక్కగా వివరించబడ్డాయి.

ఉమెన్స్ హాస్టల్ కి ఎదురుగా ఉన్న సముద్రం, టెర్రెస్ పైనుండి చూసేటపుడు సముద్రం, ప్రకృతి రచయిత్రిలో ఎన్నో క్రొంగొత్త భావాలను నిద్రలేపి కవిత్వంగా ఆవిర్భవించాయి.

"కొంచెం దూరంగా అనంతమైన నీలి సముద్రం. సెర్చిలైట్లు వేసినట్లున్నారు. ఆ లైట్ల కాంతిలో తళ తళా వెండి జల్తారులా మెరిసిపోయే అలలు, దీపాల మేడల్లా దూరంగా ఓడలు, సముద్రంలోకి చొచ్చుకొని ఉన్న పారాడే కొండలు, ఉండుండి ముఖం మీద ప్రతిఫలించే లైట్ హౌస్ కాంతి..... ఏమిటీ ప్రకృతి వైచిత్ర్యం? సముద్రాన్ని అంత అందంగా ఎవరు సృష్టించారు? ఆ నీలిమ ఏ చిత్రకారుడి కుంచె నుండి వెలువడింది? భౌతికమైన, మానసికమైన ఏ బాధలైనా ప్రకృతి కాంత ప్రియదర్శనంతో సమసిపోతాయా"? ఇవి ప్రకృతిని పరిశీలిస్తూ సుజాత – కాదు, రచయిత్రి భావాలు. ఇలా నవలలో మధ్య మధ్య పాత్రల మనస్సులలో ప్రవేశించి రచయిత్రి ప్రకృతిని వర్ణిస్తూ ఉంటారు. మరో సందర్భంలో 'ఈ సముద్రానికి ఎంత వయస్సు ఉంటుందో'?! అంటారు.

ఈ నవల 1979 లో ప్రచురితమైనది. స్త్రీలు ఎక్కువగా రచనలు చేయడం ప్రారంభించిన కాలం అది. స్త్రీ పురుషుల మధ్య సంబంధం కేవలం శారీరకమైనదిగా గాక స్నేహ పూర్వకంగా చూడబడాలనే భావన ప్రసరిస్తున్న తరుణం అది. అమలిన భావం అమలిన శృంగారంగా రాయప్రోలు వారు సిద్ధాంతీకరించిన 'తృణ కంకణం' అప్పటికే వెలుగు చూసింది. ఈ నవలలో సుజాత రాయప్రోలు వారి తృణ కంకణంలోని నాయికా ప్రభావాన్ని కలిగి ఉంది.

**'తరంగం'** నవలను స్వాతి సచిత్ర మాస పత్రిక పాఠకులకు ఉచిత బహుమతిగా 2005 మార్చిలో అందించింది. ఇందులోని అంశం పూర్తిగా భిన్నమైంది. బాగా చదువుకొని వేలల్లో జీతాన్ని ఆర్జిస్తున్న నవ యువత స్వతంత్రం పేరిట మానవ సంబంధాలను సుస్థిరం చేసుకోలేక పోవటం ఇందులోని ముఖ్యాంశం. ఈ నవలలోని నాయికా నాయకులు కృష్ణ, నీరజ సింగపూర్‌లో ఒకరికొకరు పరిచయమౌతారు. కృష్ణ ఉద్యోగం వచ్చిన  కొత్తలో సింగపూర్ నుండి తల్లిని చూడడానికి వచ్చి ఒక నెక్లెస్‌ను కొని తెచ్చాడు. ఈ నెక్లెస్ ఎంపిక చేయడంలో నీరజ సహాయం తీసుకున్నాడు. అప్పుడే తల్లికి నీరజతో తన పరిచయాన్ని గురించి చెప్పాడు. తరువాతి కాలంలో కృష్ణ, నీరజల  స్నేహం ప్రేమగా మారి పెళ్ళికి దారితీస్తుంది.

కృష్ణ వివాహం చేసుకొని భార్యతో తల్లిని చూడడానికి వచ్చినప్పుడు ఆ నెక్లెస్‌ను కోడలికి బహుమతిగా ఇచ్చేస్తుంది శారద. తల్లి ఆ నెక్లెస్‌ను పెట్టుకోలేదని కృష్ణ గ్రహిస్తాడు. 'అదేమిటమ్మా! అలా ఇచ్చేశావు'? అని అడుగుతాడు. 'నేను పెట్టుకుంటే నాకేం కనబడుతుంది? అయినా నాకీ బంగారాలెందుకు? కోడలు పెట్టుకుంటే బాగుంటుంది కదా నాన్నా'! అంటుంది శారద. కృష్ణ తల్లి కష్టాన్ని గుర్తించినా, పట్టించుకున్నట్లు కనబడదు ఈ నవలలో. తప్పదన్నట్లుగా నాలుగు రోజులు ఎలాగో గడుపుతుంది నీరజ.

తండ్రిలేని కృష్ణను తల్లి శారద స్కూల్ టీచర్ గా పనిచేస్తూ చదివించి ప్రాజ్ఞుడిగా తయారుచేస్తుంది. తల్లిని తన దగ్గరే ఉంచుకోవాలనుకుంటాడు కృష్ణ. కాని నీరజ అభ్యంతరం చెబుతుంది. ఇంట్లో పెద్దవాళ్ళు ఉంటే ప్రైవసీ   ఉండదని, తామిద్దరే ఇంట్లో ఉండాలంటుంది. చెప్పలేక చెప్పలేక ఆ మాట తల్లికి చెబుతాడు. నీరజకు సంప్రదాయాలు, వేడుకలు అంటే గిట్టవు. అందువల్ల రిజిష్టర్ మ్యారేజ్ ప్రపోజ్ చేస్తుంది. తల్లికి తన పెళ్ళి వేడుకగా చెయ్యాలనే కోరిక ఉన్నదని తెలిసినా నీరజ మాటకే విలువిస్తాడు కృష్ణ. ఫలితంగా శారద కొడుకు ఆనందంగా ఉండాలని కోరుకుంటూ తన స్వంత జీవితాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. కొడుకూ కోడలూ హైదరాబాదులో మకాము పెట్టాక శారద పదవీ విరమణ చేసినా, ఇంట్లో ఖాళీగా కూర్చోదు. తన చుట్టుపక్కల ఉన్న అక్షరజ్ఞానం లేని మహిళా సంఘాలతో స్నేహం చేసి వారికి మంచి చెడ్డలు చెబుతూ ఉంటుంది. వారికి బ్యాంకు కాగితాలూ అవీ నింపి పెట్టడం, ఉత్తరాలు వ్రాసి పెట్టడం, చదివి వినిపించడం ఇలా పంచాయితీ, తాలూకా, కలెక్టరాఫీసుల్లో వారి పనులకు సంబంధించిన దరఖాస్తులు నింపడం, వారితో కూడా ఉండి వారికి సహాయ పడడం వంటి పనులు చేస్తూ ఉంటుంది. అందువలన ఆమెకు తీరిక ఉండదు. ఎందుకిదంతా? అంటాడు కృష్ణ. బ్రతికినందుకు నలుగురికీ ఉపయోగపడాలి కదా'! అంటుంది శారద.

కృష్ణ నీరజల బిడ్డ బబ్లూకి ఒకసారి జ్వరం వచ్చింది. ఇద్దరికీ ఆఫీసుల్లో తప్పనిసరిగా చేయవలసిన పనులున్నాయి. ఆ పనులు వారి కెరీర్‌ను తీర్చిదిద్దేవి. జ్వరంగా ఉన్న పిల్లవాడిని క్రష్ లో వదిలివేయలేక కృష్ణ చేత అత్తగార్ని పిలిపించుకుంటుంది నీరజ. ఆమె ఇంట్లో ఉన్నన్ని రోజులూ తాను చేసిన తప్పేమిటో నీరజకు అర్థం అవుతూ ఉంటుంది. శారద తిరిగి తన స్వస్థానానికి ప్రయాణమవుతుంది. నీరజ, కృష్ణలు అభ్యంతరం చెప్పినా శారద వినదు. "మీరు ఏ విదేశాలలకో వెళ్ళవచ్చు. బాబు ఏ బోర్డింగ్ స్కూల్లోనో చేరతాడు. నా మూలాలన్నింటినీ నేను త్రెంపుకు వచ్చేసినా ఇక్కడ మీరు స్థిరంగా ఉంటారని చెప్పలేము. మీతరం ఆలోచనలు వేరు, నా ఆలోచనలు వేరు. మీకు స్వతంత్రం కావాలి. మీదైన ప్రపంచం మీరు నిర్మించుకున్నారు. అదే విధంగా నాకూ స్వతంత్రం కావాలి. అందుకే నాదైన లోకం నేను ఏర్పరుచుకున్నాను" అంటుంది. శారద. ఈ నవలలో 'సంసార తాపత్రయానికి అంతెక్కడా'? అనుకుంటూ సిసలైన తన గమ్యాన్ని గుర్తించింది శారద.

సింగపూర్‌లోని వైట్ సఫారీ, సన్‌సెట్‌సిటీ, జూరాండ్ బర్డ్ పార్కు, ముస్తఫా షాపింగ్‌మాల్, ఇలా సింగపూర్ అందాలన్నీ కళ్ళకు కట్టినట్లు వర్ణించి రచయిత్రి పాఠకుల మనస్సును సింగపూర్‌లో విహారం చేయించి తీసుకువస్తారు.

శారదను ఆపాలని ఉన్నా కృష్ణా నీరజలు ఇద్దరూ ఆపలేకపోతారు. ఎవరికి వారే ఆత్మగ్లానితో మథనపడతారే తప్ప ఒకరితో ఒకరు మనసు విప్పి చెప్పుకోరు. శారద మాత్రం నిండుగా సంతోషంగా ఉంది. "శారద జీవిత చిత్రాన్నీ ఆమె ఆశయాలనూ మోసుకుంటూ ట్రయిన్ ముందుకు..... ముసు ముందుకు సాగింది" అంటూ ఈ నవలను రచయిత్రి ముగించారు. ఈ ముగింపు వాక్యం జీవయాత్రలో తల్లి తండ్రుల పాత్రను, వారు నిర్మించుకోవలసిన జీవన చిత్రాన్ని సూచిస్తోంది.

సింగపూర్‌లో అన్నీ దిగుమతులే. అక్కడ ఏమీ లభించవు. కానీ సింగపూర్ ఆర్థికంగా బాగా బలపడింది. అందుకు కారణం అక్కడి ప్రజలు నిజాయితీగా కష్టించి పనిచేసే మనస్తత్వం కలిగి ఉండటమేనంటారు రచయిత్రి. అక్కడి ప్రజల మనస్తత్వం భారతీయులకు ఉంటే భారతదేశం ఎప్పుడో ప్రపంచంలో సుసంపన్న దేశమయ్యేదంటారు ఈమె.

*****

**ఆధారాలు :**

1. శ్రావణ మేఘాలు – నందుల సుశీలా దేవి
2. తరంగం – నందుల సుశీలా దేవి
3. రచయిత్రి నందుల సుశీలా దేవి తో ముఖాముఖి